క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు

మాచవరం: గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల సుస్థిరాభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామ పంచాయతీలలో ప్రణాళికలు ఎలా తయారు చేసుకోవాలో తెలియజేశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల పాత్ర ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివాయాదవ్, సూపరింటెండెంట్ ప్రసాద్, ఈఓపీఆర్డీ వెంగళరావు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలకు మాలధారులు



మాచర్ల : పట్టణం నుంచి అయ్యప్ప మాలధారులు సోమవారం ఇరుముడి కట్టించుకుని వీరభద్ర స్వామి దేవాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి శబరిమలకు తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సుల్లో అయ్యప్ప మాలధారులు శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మహిళలచే గీతా పారాయణం, సహస్ర నామార్చన, గోదాదేవికి కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ధనుర్మాసంలో రామనామ స్మరణతో పాపాలు తొలగిపోతాయని పూజారులు తెలియజేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



సత్తెనపల్లి: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లలో వైద్యాధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సత్తెనపల్లి ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి ఆధ్వర్యంలో స్కాన్ సెంటర్లు పీసీ, పీఎన్‌డీటీ చట్ట ప్రకారం పాటించాల్సిన నియమాలు తెలియజేసి, రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి



పెదకూరపాడు: వీఆర్‌ఏ ఆశీర్వాదం (57) గుండెపోటుతో లగడపాడు గ్రామంలో సోమవారం మృతి చెందాడు. 40 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆయన మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆశీర్వాదం మృతి తీరని లోటు అని తహసీల్దార్ మీసాలు దానియేల్ సంతాపం తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో కంప్యూటర్, టాలీ కోర్సుల్లో నైపుణ్య శిక్షణ, వంద శాతం ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ సోమవారం తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్మీడియెట్, డిగ్రీ పాస్, ఫెయిల్ విద్యార్థులు 18–28 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. 35 రోజుల శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. శిక్షణలో టాలీ ప్లస్, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్, ఇంటర్వ్యూ స్కిల్స్ నందు ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 90004 87423 నంబరుకు సంప్రదించాలని చెప్పారు.

20లోపు విచారణ పూర్తి చేయాలి

ముప్పాళ్ళ: ఎన్నికల ప్రత్యేక సవరణ జాబితా ముసాయిదాలో భాగంగా అందిన అర్జీల విచారణ ఈ నెల 20లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా నూతన ఓటర్ల కోసం, ఓటరు జాబితాలో సవరణ కోసం అందిన అర్జీలన్నీ త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీటీ సీహెచ్ లక్ష్మీ ప్రసాద్, ఆర్‌ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వాహనాలు.. రయ్.. రయ్

- ఏళ్ల తరబడి ఉన్న బైపాస్ సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం
- నాడు వైఎస్సార్ బైపాస్ మంజూరు
- నేడు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బైపాస్ సమస్య పరిష్కారం
- అందుబాటులోకి పూర్తిస్థాయిలో బైపాస్ రెండు లైన్‌లు
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో బైపాస్ పూర్తి

బైపాస్ నిర్మాణం పూర్తవడంతో తీరిన ట్రాఫిక్ కష్టాలు



రైల్వే ఓవర్ బ్రిడ్జి ఒక లైన్‌లో వాహనాలు వెళ్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతుందని హైదరాబాద్ వెళ్లేందుకు గుంటూరు, నరసరావుపేట ఒంగోలు పలు ప్రాంతాల ప్రజలకు వెసులుబాటు కల్పించాలనే సంకల్పంతో అప్పటి ముఖ్యమంత్రి దివంగత మహానేత రాజశేఖర్‌రెడ్డి అద్దంకి–నార్కెట్‌పల్లి జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మార్గంలో 2.30 గంటల్లో హైదరాబాద్ చేరుకునేలా బైపాస్ నిర్మాణం చేపట్టారు. బైపాస్ నిర్మాణం పూర్తి అయింది కానీ పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు మాత్రం ట్రాఫిక్ కష్టాలు తీరని సమస్యగానే మారిపోయింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా బైపాస్ పనులు

బైపాస్ రోడ్డు పిడుగురాళ్ల పట్టణంలోని ఖలీల్ దాబా వద్ద నుంచి కొండమోడు జంక్షన్ వరకు 6 కిలో మీటర్ల మేర ఉంది. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే పిడుగురాళ్ల పట్టణంలోకి ఎలాంటి భారీ వాహనాలు రావు. కానీ ప్రభుత్వాలు మారినా ఈ బైపాస్ సమస్య పరిష్కారం కావటం లేదని ప్రజలు ఏళ్ల తరబడి నాయకులకు చెప్పుకునేవారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవ తీసుకొని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి పిడుగురాళ్ల పట్టణ ప్రజల ట్రాఫిక్ సమస్యను వివరించి వెంటనే భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం గుత్తేదారులే చెల్లించే విధంగా ఒప్పించి ప్రభుత్వం నుంచి అనుమతులను కూడా తీసుకొని వచ్చారు. దీంతో బైపాస్ పనులు శరవేగంగా జరిగాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చొరవతోనే..

6 కిలో మీటర్లలో కూడా రైల్వే ఓవర్ బ్రిడ్జి సమస్యగా మారటంతో వెంటనే రైల్వే ఉన్నతాధికారులతో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడి ఆ సమస్యను కూడా పరిష్కరింపజేసి వెంటనే బైపాస్‌పై బళ్లు వెళ్లేలా చేశారు. అయితే అప్పుడు ఒక లైన్ మాత్రమే పూర్తి చేసిన రైల్వే అధికారులు ఇప్పుడు రెండవ లైన్ కూడా పూర్తి చేయటంతో ఎటు వైపు వెళ్లే వాహనాలు అటువైపు వెళ్లేలా అధికారులు సర్వం సిద్ధం చేశారు. దీంతో పిడుగురాళ్ల పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో చొరవ చూపిందని పట్టణ ప్రజలు చెప్పుకుంటున్నారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద పూర్తయిన రెండవ లైన్



ట్రాఫిక్ సమస్య పూర్తిగా పరిష్కారం

పిడుగురాళ్ల పట్టణంలోని 4వ వార్డు నుంచి మార్కెట్ యార్డు వరకు వెళ్లాలంటే సుమారు 1 గంట సమయం పట్టేది. కానీ ఇప్పుడు ట్రాఫిక్ సమస్య లేకుండా బైపాస్ పూర్తి కావటంతో వెంటనే ఏ ప్రాంతానికి చేరాలన్న 10 నిమిషాల్లో చేరుకోగలుగుతున్నాం.

– చిట్టిబోయిన నరసింహారావు యాదవ్, పిడుగురాళ్ల



భారీ వాహనాలు లేక ప్రమాదాలు తగ్గాయి

గతంలో భారీ వాహనాలు పిడుగురాళ్ల పట్టణం నుంచి వెళ్తూ ఉండేవి. కానీ నేడు బైపాస్ పూర్తి కావటంతో భారీ వాహనాలు పిడుగురాళ్ల పట్టణంలోకి రాకుండా పోతున్నాయి. భారీ వాహనాలు రావటం వలన గతంలో ఎన్నో ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. కానీ ఇప్పుడు ప్రమాదాలు జరగటం లేదు.

– మేదగం శివశంకర్‌రెడ్డి, పిడుగురాళ్ల

సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేయాలి

ఎంపీడీఓ ఫణికుమార్



మాచర్ల రూరల్: సుస్థిర అభివృద్ధి, లక్ష్య సాధనకై ఉన్నతాధికారులందించు శిక్షణను సచివాలయ సిబ్బంది సద్వినియోగ పర్చుకొని మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎల్‌ఎస్‌డీజీ స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సక్రమంగా అమలు పర్చటం, గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేసి సుస్థిర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, ఏఓ శర్మ, పంచాయతీ కార్యదర్శులు యెల్లెబోయిన కోటేశ్వరరావు, బిట్టు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకటనారాయణ, టి.పి. సత్యనారాయణ, సర్వేయర్లు ఆదినారాయణ, అంజి, సీడీపీఓ సరళావతి తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడవాలి



ప్రార్థనల్లో ఎమ్మెల్యే జూలకంటి తదితరులు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో భక్తులు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల : ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వీవీఎస్ గార్డెన్స్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ క్రైస్తవ సమాజానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రార్థనా మందిరాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎస్.కుమార్, మాచర్ల వాసు, పుల్లారావు, చర్చి పాస్టర్లు, టీడీపీ నాయకులు యనముల కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రానాయక్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

నలుగురికి గాయాలు



కంభంపాడు వద్ద ప్రమాదానికి గురైన ఆటో



ఆటోలో ఇరుక్కొని మృతి చెందిన కత్తి సుబ్బయ్య

మాచర్ల రూరల్: ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి ఆటో బోల్తా పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కంభంపాడు గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. కంభంపాడు నుంచి రెంటచింతలకు బయలుదేరి వెళ్తున్న ఆటో గ్రామ శివారులోని గన్నవరం గ్రామ కూడలి వద్దకు చేరుకునే సమయంలో ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి ఆటో పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ పక్కన కూర్చున్న కత్తి సుబ్బయ్య (50) ఆటో ముందు భాగంలో ఇరుక్కుపోయి ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ ఎం.నారాయణ, ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను గమనించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాబ్ అండ్ ఎక్సరే అసోసియేషన్ అధ్యక్షుడిగా మహేష్



ల్యాబ్ అండ్ ఎక్సరే అసోసియేషన్ సభ్యులను సన్మానించిన పట్టణ ప్రముఖులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల డివిజన్ ల్యాబ్ అండ్ ఎక్సరే అసోసియేషన్ అధ్యక్షులుగా పోతులూరి మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ల్యాబ్ అండ్ ఎక్సరే అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీని సోమవారం ఎన్నుకోవటం జరిగింది. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా ల్యాబ్ అండ్ ఎక్సరే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వట్టికొండ సాంబశివరావు, సెక్రటరీ గంజి శ్రీనివాసరావు, ట్రెజరర్ చల్లా శివలింగయ్య, గౌరవాధ్యక్షుడు పెద్దింటి ఫణికృష్ణ, సెక్రటరీ యేండ్లూరి మల్లేశ్వరరావులు పాల్గొని నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా పోతులూరి మహేష్, గౌరవాధ్యక్షుడిగా తిరువీదుల నాగ శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు పరిమి ప్రవీణ్, సెక్రటరీ జానీబాషా, ట్రెజరర్‌గా కనకం శ్రీకాంత్, వైస్ సెక్రటరీగా వేమవరపు బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. ఎన్నుకున్న వారిని పట్టణ ప్రముఖులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల డివిజన్ పరిధిలోని ల్యాబ్ సభ్యులు హాజరయ్యారు.

అమ్మో.. ట్రాఫిక్ జామ్..!



గాంధీ బొమ్మ సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

కారెంపూడి: స్థానిక కొట్ల బజారులో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సోమవారం సాయంత్రం యథావిధిగా ఇది రిపీట్ అయ్యింది. దీంతో ట్రాఫిక్ జామ్ కావడం ప్రజలు ఇబ్బందులు పడడం జరిగింది. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి పాత చెక్‌పోస్ట్ సెంటర్ వరకు కొన్నేళ్లుగా ట్రాఫిక్ సమస్య నెలకొంది. బస్టాండ్ సెంటర్‌ను కలుపుతూ ఉన్న అంకాళమ్మ గుడి బజారులో వాహనాల రద్దీ బాగా పెరిగింది. అలాగే బస్టాండ్‌లో క్రమ పద్ధతి లేకుండా ఆటోలు ఇతర వాహనాలను నిలపడం అలాగే తోపుడుబండ్లు ట్రాఫిక్‌కు అంతరాయంగా మారుతున్నాయి. గతంలో లాగా ఒక క్రమ పద్ధతిలో తోపుడుబండ్ల వ్యాపారులకు స్థలాలు కేటాయించడం చేయడంతో పాటు షాపుల వాళ్లు కూడా ముందుకు రావడం కూడా సమస్యకు కారణంగా కన్పిస్తోంది. ప్రత్యామ్నాయం లేదు గనుక ఉన్నంతలో క్రమశిక్షణ పాటించే విధంగా చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ నెల 28న ఉచిత మెగా వైద్య శిబిరం

మాచర్ల : పట్టణంలోని రామాటాకీస్ లైనులో భార్గవి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 28 శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో ఉచితంగా షుగర్, బీపీ, ఈసీజీ, కిడ్నీ తదితర పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. భార్గవి ఆసుపత్రి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9441920319 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

హుండీ దొంగల అరెస్ట్



వెల్దుర్తి: మండలంలోని కండ్లకుంట గ్రామంలో గంగా భవాని గుడిలోని హుండీని పగలగొట్టి రూ.1,05,000 నగదును దోచుకెళ్లిన వారిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సోమవారం ఎస్‌ఐ షేక్ సమందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కండ్లకుంట గ్రామంలో గంగా భవాని దేవాలయంలోని హుండీని మారబోయిన చంద్రయ్య, కేశిరెడ్డి సాయికృష్ణారెడ్డి, బొడ్డపాటి మార్కొండారెడ్డిలు దొంగతనం చేశారన్నారు. తన సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

క్రిస్మస్ స్టార్‌తో అభిమానం

అచ్చంపేట: మండలంలోని అంబడిపూడి ఎస్సీ కాలనీలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అభిమానులు క్రిస్మస్‌స్టార్‌తో తమ అభిమానాన్ని చాటుకున్నారు. పెద్ద స్టార్‌పై వైఎస్‌జగన్ ఫొటో ఏర్పాటు చేశారు. క్రిస్మస్ పండుగ అయ్యేంత వరకు స్టార్ గుండ్రంగా తిరుగుతూ ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు.

101 మద్యం బాటిళ్లు స్వాధీనం

అమరావతి: మండల పరిధిలోని జూపూడి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను సోమవారం అమరావతి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండు బెల్టు షాపులపై దాడి చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల చిరంజీవి వద్ద 81 బాటిళ్లు, చెవల మధుసూదనరావు వద్ద 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింగయ్య



మాచర్ల : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో విద్యుత్ శాఖ సిబ్బంది బాధ్యతతో పని చేయాలని మాచర్ల విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింగయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో డివిజనల్ పరిధిలో డీఈ, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో ఈఈ సింగయ్య మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. సంవత్సరం నెల చివరలో రూ.వేల కోట్ల బకాయిలు అందించేందుకు విద్యుత్ శాఖ ఇంజినీర్లు బృందాలుగా ఏర్పడి చౌర్యం జరుగుతున్న ప్రాంతాల్లో పర్యటించి తనిఖీలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో లోటుపాట్లు గుర్తించాలన్నారు. లో వోల్టేజీ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర లైనుల మరమ్మతులు సత్వరమే పరిష్కరించాలన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈలు, విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ప్రత్యేక క్యాంపులు వినియోగించుకోవాలి



మాచర్ల : మాచర్ల పురపాలక సంఘం పరిధిలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.వేణుబాబు సోమవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు బ్యాంక్ కాలనీ సచివాలయం, ఫైర్ స్టేషన్ కాలనీ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలందరూ ఈ క్యాంపులను వినియోగించుకొని పేరులో తప్పులు, అడ్రస్సు మార్పులు, తదితర ఆధార్‌లో మార్పులకు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కారెంపూడి: మండలంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు 17వ తేదీ మంగళవారం నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని తహసీల్దార్ పుల్లారావు సోమవారం తెలిపారు. 17వ తేదీ గాదెవారిపల్లె, 18, 19 తేదీలలో ఇనుపరాజుపల్లె, 20, 26 తేదీలలో కాచవరం, 27, 28 తేదీలలో బట్టువారిపల్లె గ్రామాలలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు. కొత్త ఆధార్ కార్డు కోసం, వేలి ముద్రలు, డాక్యుమెంట్ అప్డేట్, పేరు, పుట్టిన తేదీ, అడ్రస్‌లలో మార్పులు, ఆధార్‌కు మొబైల్ నంబరు లింకు చేయడం జరుగుతుందని ఆధార్ సేవలు అవసరమైన ప్రజలు క్యాంపులకు హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

మాచవరం: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 17, 18 తేదీలలో మాచవరం, మోర్జంపాడు, 19, 20 తేదీలలో పిన్నెల్లి, పిల్లుట్ల, కొత్తపాలెం, 26న మల్లవోలు, 27న కొత్తగణేశునిపాడు, 28న శ్రీరుక్మిణీపురం గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. కావున ఆయా గ్రామాల ప్రజలు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

నేడు డీసీ చైర్మన్ ఎన్నికలు

దాచేపల్లి : సాగునీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) చైర్మన్ ఎన్నికలు మంగళవారం జరగనున్నాయి. ఇటీవల సాగునీటి సంఘాలకు చైర్మన్‌లను ఎన్నుకున్నారు. సాగునీటి సంఘాల చైర్మన్లు అందరూ కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. తంగెడ, రామాపురం మేజర్ కాలువలకు డీసీ కమిటీ చైర్మన్ ఎన్నికలు జరిపేందుకు చర్యలు తీసుకున్నామని జలవనరుల శాఖ ఏఈ పసుపులేటి ఆదినారాయణ సోమవారం తెలిపారు.

పట్టణంలో చలి, మంచు మూడు రోజులుగా తీవ్రంగా ఉంది. గత కొన్ని రోజులుగా విపరీతంగా పొగ మంచు పట్టణాన్ని కమ్మేసింది. గుంటూరు రోడ్డు, సాగర్ రోడ్డులో మంచు ప్రభావంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ప్రజలు కూడా చలి తీవ్రతకు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు.

– మాచర్ల





సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



అమరావతి: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని సైబర్ క్రైమ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ పేర్కొన్నారు. సోమవారం ధరణికోట రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు డిగ్రీ కళాశాల విద్యార్థులకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక అంశాల్లో నేడు అధికంగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. తొలి దశలో వీటిని అరికట్టటానికి ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరమన్నారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు చెప్పడం, సమాచారం ఇవ్వడం వంటివి చేయకూడదన్నారు. ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో మోసం జరిగిన వెంటనే సంబంధిత శాఖకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.